'డ్రీమ్‌లాండ్' రెస్టారెంట్ నియాన్‌లైట్ల వెలుగుల్లో తళతళ్ళాడుతోంది. 'వెల్‌కం' బోర్డులో అక్షరాలుగా అమర్చిన చిన్న చిన్న రంగు రంగుల బల్బులు సిగ్గు పడుతున్న పదహారేళ్ళ ఆడపిల్ల కనురెప్పల్లా 'ఫ్లికర్' అవుతున్నాయి.

గ్లేజ్డు గ్లాస్ మీద ఎర్ర రంగుతో మనోహరంగా పెయింట్ చేయబడిన పెదవుల్లో దొరగా తొంగి చూస్తోంది మృదువైన దరహాసం. ఆ హాసం పాశమై లాగుతుంటే, అటుగా అడపాదడపా




వెళ్తున్న పగటు మనుష్యులు—వసం చస్తున్న దశలో కూడా వెనక్కు వెనక్కు ఆశగా తిరిగి చూస్తూ, నిరాశగా ముందుకు కదులుతున్నారు.

అందమైన షవర్లెట్ మెత్తగా సాగుతూ వచ్చి, మెత్తగా ఆగింది డ్రీమ్‌లాండ్ ముందు. ఖరీదైన డెకోలామ్‌డోర్‌నూ, ఆ డోర్ లోపలి బార్‌నూ కాపలా కాస్తున్న గుర్ఖా బ్రాస్ బిళ్ళ మీద తళుక్కున మెరిసింది హెడ్ లైట్స్ కాంతి.

చక్రధర్ కారు దిగి, డోర్ తెరిచి పట్టుకుని "ప్లీజ్ సర్. . .!" అన్నాడు. ఆ అనడంలో దర్పం ఉంది. దర్పానికి భంగకరం కాని పొలైట్‌నెస్ ఉంది..

"థాంక్యూ మిస్టర్ చక్రధర్!" టీవీగా దిగాడు పి. డబ్ల్యు. డి. డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ నీలకంటం.

"దిస్ వే సర్. . .ప్లీజ్ కమాన్. . .ఏయ్ గూర్ఖా. . .కార్లో 'బ్రీఫ్' ఉంది తీసుకురా. . !" అన్నాడు, కొంచం యాంగ్యులర్‌గా ముందుకు పడుతూ.

"యస్ సర్. . .!" అంటూ సెల్యూట్ కొట్టి గూర్ఖా కారువైపు పడిచాడు.

డోర్ దగ్గర ఆగిపోయాడు చక్రధర్. చూపుడు వేలితో అద్దం మీది పెదవుల అంచుల్ని పృజిస్తూ, 'బ్యూటిఫుల్!' అన్నాడు నీలకంటాన్ని చూస్తూ.

"ఎస్సెస్. . .! ఇటీస్ మార్వెలెస్ ఐ సే!" అన్నాడు నీలకంటం కళ్ళార్పకుండా పెదవుల్నిచూస్తూ.

చక్రధర్ పెదవుల మీద 'గర్వం' లీలగా నవ్వింది.

ఏ.సి. హాల్ విశాలంగా ఉంది. మొజాయిక్ ఫ్లోరింగ్ నిగనిగలాడుతూ నీడలు తేలుతోంది. కిటికీలకు కట్టిన మొహమల్ పరదాల ఎరుపు కళ్ళకు మిరుమిట్లు గొలుపుతూంది. ఎడ్జస్టబుల్ పుల్లీస్ మీద వేలాడుతున్న ఖరీదైన ఎలక్ట్రిక్ బల్బుల గొంతుల్లో నుండి కాంతి—పాదరసంలా డెకోలమ్ టేబిల్స్ మీద అందంగా పాకుతూంది జరజరా. . .

హాల్ చివరికంటా వెళ్ళి ఒక మూలగా కూర్చున్నారు చక్రధర్, నీలకంటం.

టేబుల్ ప్రక్కనే అమర్చిన కన్‌సీల్డ్ స్పీకర్ నుండి చానల్ మ్యూజిక్ జోలపాడు తున్నట్లుగా వినిపిస్తోంది.

స్టీవార్డ్ వచ్చి వినయంగా విష్ చేసి, "ఎస్ సర్! వాట్ విల్ ఐ గెట్ ఫర్యూ...?" అన్నాడు ఆర్డర్ బుక్ మీద పెన్సిల్‌తో సిద్ధంగా తలను 'స్టైలిష్'గా కొంచెం ఒక పక్కకు వంచి.

చక్రధర్ నీలకంటం వైపు చూశాడు ప్రశ్నార్థకంగా.

'మెనూ' కార్డును చూసీచూడనట్లుగా చూసి విరాసక్తిగా 'ఎనీథింగ్' అంటూ టేబిల్ మీద జారవిడిచాడు నీలకంటం.

"స్టీవార్డ్. . .వోడ్కా ఉందా. . .ఒరిజినల్!" అన్నాడు చక్రధర్ తగ్గు స్వరంతో.

ఒక క్షణం తటపటాయించి "యస్సర్" అన్నాడు స్టీవార్డ్ అంతకంటే మెల్లిగా.

"దెన్ ప్లీజ గెటజ వన్ బాటిల్ ఆఫ్ వోడ్కా... చిప్స్. . .ఫ్రైడ్ రైస్ టు ప్లేట్స్. .స్క్రాంబుల్డ్ ఎగ్. . .బై దిబై లుక్. . .గెట్ టూ బ్రెయిన్... ఐ మీన్ ఫ్రైడ్ స్టఫ్. . .!" అన్నాడు చక్రధర్.

మెచ్చుకోలుగా చూశాడు నీలకంటం.

"యూ ఆర్ వెరీ బ్రిలియంట్ మిస్టర్ చక్రధర్. . .! అన్నట్లు నీకు పెళ్ళయిందా?" అన్నాడు ఆశగా నీలకంటం. ఆ ఆశ అక్కడకు ఐదు కిలో మీటర్ల దూరంలో, బెడ్ రూంలో విద్ర పట్టక దొర్లుతూ 'నాటినైవ్' హాట్ పుస్తకం చదువుతున్న పాతికేళ్ళ మూడో కూతురి పరవశ చేర్చింది ముప్పై ఏళ్ళ మిసమిసలాడే చక్రధర్ పడుచు శరీరాన్ని.

"నో సర్. . .అయామ్ స్టిల్ ఏ బాచులర్. . ఇప్పట్లో చేసుకోవాలనే ఉద్దేశ్యం కూడా లేదు!" అన్నాడు చక్రధర్ మోడెస్టుగా.

అంతలో గూర్ఖా ఇచ్చిన బ్రీఫ్‌కేసు తీసుకొచ్చి చక్రధర్ పక్కన పెట్టాడు బేరర్.

డయాస్ మీద ఫ్లడ్ లైట్స్ వెలిగాయి.

స్టీరియోలో సన్నని సంగీతం ప్రారంభం అయింది చానల్ మ్యూజిక్ ఆగిపోయి. జాజ్. . . ఎకార్డియన్ . మెండొలిన్. . . కాంగోస్. . .

ఇన్‌స్ట్రుమెంట్లన్నీ ఒకదాని తర్వాత ఒకటి లయబద్ధంగా, గుండెల్లో గిలిగింతలు కలిగేలా, వూహల్ని ఆకాశానికి లేపుకు పోతూ మంద్రంగా, సంగీత ఝరీప్రవాహంతో ఆ ప్రదేశాన్ని నింపేస్తున్నాయి.

స్టీవార్డ్‌తో బాటు వచ్చిన ఒక బేరర్ టేబిల్ మీద ఇద్దరి ముందూ క్రోకరీని, కట్లరీని ఒద్దికగా అమర్చాడు చకచకా. మరో బేరర్ ఐటమ్స్ తీసుకు

వచ్చాడు.

"ఇవన్నీ ఎందుకోయ్!" అన్నాడు నీలకంఠం మొహమాటంగా ముడుచుకు పోతూనే, మొహాన్ని చాటంత చేసుకుని.

"నథింగ్ సర్. . .ఏదో నా తృప్తి కోసం. . .!" అన్నాడు చక్రధర్—"మీరు తీసుకోకపోతే నన్ను హర్ట్ చేసిన వారవుతారు!" అన్నాడు మళ్ళీ నవ్వుతూ, బ్రెయిన్‌ను ఫోర్కుతో పొడుస్తూ.

సంగీతం ఆగిపోయింది కిరసనాయిల్ అయిపోయిందన్న షావుకారు మాట విన్న 'క్యూ' లా.

"గుడీవినింగ్ లేడీస్ అండ్ జెంటిల్ మన్. . . నౌ ది ప్రోగ్రామ్ స్టార్ట్స విత మిస్ బెట్టీ ది స్వీట్ సిక్స్టీన్. . .అయ్ విష్‌యూ ఆల్—ది మోస్ట్ ఫాసినేటింగ్ నైట్. . .!" అంటూ ముగించాడు, డ్రమెటిక్‌గా నెక్‌టైని మధ్య మధ్యలో సవరించుకుంటూ, కాంపేరర్.

కాంగోస్ ఘుల్లుమని మోగాయ్.

డయాస్ మీద బెట్టీ డాన్స్ మొదలైంది.

"ప్చ్. . .ఏజ్ టీనేజేమో కాని. . .ఆ తోలు. . అబ్బే. . .ఎంత మేకప్ చేస్తే మాత్రం ఆ వలువు విరుగుతుంది!" విరక్తిగా అనుకున్నాడు నీలకంఠం బెట్టీని చూస్తూ.

"సార్. . .? మీరు అసలేం తీసుకోవటం లేదు!" అన్నాడు చక్రధర్ గ్లాస్ ముందుకు జరుపుతూ.

"చక్రధర్. . .నువ్వు వయసులో చిన్నవాడివైనా, బిజినెస్‌లో అఖండుడివోయ్. . .అందుకే మా ఆవిడతో అంటుంటాను—నువ్వు చాకులాంటి కుర్రాడివని. . .!" స్వర పేటికలో నుండి క్రిందకు జారుతున్న వెచ్చని వోడ్కాతో కలిసి, నీలకంఠం మాటలు మంచు వాసన కొడుతున్నాయి.

"అబ్బెబ్బె. . .అభిమానం చూపించే మీకు అలా అనిపిస్తున్నది కాని, పెద్దవారు మీ సలహా సహాయాలే అందుక్కారణం గాని నా ప్రతిభేం ఉంది సార్. . .?" అన్నాడు చక్రధర్ గౌరవం ఉట్టి పడుతున్న గొంతుతో.

నోట్లో వేసుకుంటే కరిగిపోతున్న ఫ్రైడ్ బ్రెయిన్ కన్నా రుచిగా తోచాయ్ నీలకంఠానికి చక్రధర్ మాటలు—ఒక్క "పెద్దవారు" అన్న పదం తప్ప. ఆ పదంలో పెళ్ళి కాని మూడో కూతురు కన్పించింది అతనికి ఆ క్షణాన.

"ఏయ్ బేరర్. . . మరో వోడ్కా, రెండు జింజర్ చికెన్ ప్లేట్లూ." అని కేకేశాడు చక్రధర్.

మిస్ బెట్టీ మెలికలు తిరుగుతూ నాట్యం చేస్తూంది. బేరర్స్ చీకట్లో, బల్లుల్లాగా గోడలకు అంటుకుని, ఒదిగి ఒదిగి నడుస్తున్నారు అటూఇటూ, విజిటర్స్‌కు అంతరాయం కలగకుండా.

"సార్. . .! క్రితంసారి కాంట్రాక్ట్‌లో సగానికి సగం పైగా నష్టం వచ్చిందని మీకూ తెలుసు. .!" ఆఖరు వోడ్కా చుక్కను గొంతులోకి ఒంపుకొని, నీలకంఠాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ అన్నాడు చక్రధర్. . .

"ఆ. . .? ఆ. . .ఎస్సెస్. . ." అన్నాడు బెట్టీ శరీరపు అంచుల్ని చూపులతో నిమురుతున్న నీలకంఠం.

సీల్డ్ వోడ్కా ఠీవిగా నిల్చింది టేబుల్ మీద.

చక్రధర్ రెండు గ్లాసుల్లో సగం వరకూ పోసి, సోడా కలిపాడు. ఆ తర్వాత, మెల్లిగా బ్రీఫ్ తెరిచి బిల్స్‌ను బయటకు తీశాడు.

నీలకంఠం కనురెప్పల్ని బరువుగా ఎత్తుతూ "ఏమిటదీ?" అన్నాడు వోడ్కా మీదా స్ప్రే చేస్తూ.

"ఏం లేదు సార్! డబ్బుకు చాలా ఇబ్బందిగా ఉంది. ఇప్పుడు చేస్తున్న వర్క్సు కూడా పూర్తి అయ్యేట్టు లేవు. అందుకని ఈ రన్నింగ్ బిల్స్ పాస్ చేస్తే. . .!"

"చూదాం లేవోయ్. . .! నీకు మరీ తొందర ఎక్కువ. . .అసలు వర్క్ మొదలు పెట్టకుండానే 'బిల్స్' అంటే ఎల్లా. . .?" అన్నాడు విసుగ్గా, బట్ట తల మీద చేత్తో రాసుకుంటూ.

చక్రధర్ కొంచెం ఖంగు తిన్నాడు. 'కొంపదీసి ముసిలాడు బెడిసి కొట్టడు కదా!' అని.

కసిగా, మరో రవుండ నింపాడు. అతని కళ్ళు ఎర్రగా చింత నిప్పుల్లా మండుతున్నాయి.

అంతలోనే మ్యూజిక్ ఆగిపోయింది. బెట్టీ, అలవోకగా వంగి వంగి, వెనక్కు నడుస్తూంది, విజిటర్స్‌కు నమస్కరిస్తున్నట్లుగా.

"నౌ మై ఫ్రెండ్స్. . . యు విల్ సీ ది మోస్ట్ సెక్సీ గాల్ అండ్ ఫేమస్ బెల్లీ డాన్సర్ సంయుక్త. . .!" హుషారుగా అనౌన్స్ చేశాడు కాంపేరర్.

హాల్లోని లైట్లన్నీ 'డిమ్' అయ్యాయి.

డయాస్ మీద స్ట్రోబ్ లైట్ కాంతిలో తళుక్కున మెరిసింది సంయుక్త మెరుపులా. నల్లని శాటిన్ గౌన్‌లో ఆమె శరీరం పచ్చగా, బంగారు తీగలా సొగసు లొలుకుతూంది. స్ట్రోబ్ లైట్ రంగుల్లో ఆమె ఒంటి ఒంపులు ఇంద్రధనస్సులా మెలికలు తిరుగుతున్నయ్. ఆమె పెదవుల మీది తడి మీద ప్రతిఫలిస్తున్న కాంతి కిరణాలు ప్రేక్షకుల కళ్ళల్లోకి తమకంగా దూసుకు పోతున్నాయ్. . .

నీలకంఠం చేష్టలు దక్కి, వూపిరి బిగబట్టి, కళ్ళప్పగించి చూస్తూ, పెదవులు తడుపుకున్నాడు.

సంయుక్త శరీరాన్ని అద్భుతంగా కదిలిస్తూ, అడుగులు వేస్తూంది.

"వాటే బ్యూటి. . .! కమాన్ బేబీ . . . రిమూవ్ దట్ డర్టీ క్లాత్ పీసెస్. . .." అని అరిచా రెవడో.

చక్రధర్‌కు మాత్రం మనసంతా కళ్ళముందున్న మూడు లక్షల బిల్లు మీదున్నది. అసహనంగా 'సార్!' అని ఏదో చెప్పబోయాడు.

"చూడు చక్రధర్. . .ఆ పిల్ల ఎంత అద్భుతంగా. . .అబ్బ. . . ఒక్కసారి ముట్టుకుంటే చాలోయ్. . .జన్మంతా తరించి పోతుంది!" అన్నాడు నీలకంఠం, మడతపడుతున్న నాలుకను అదుపులోకి తెచ్చుకోవాలని వృథా ప్రయత్నం చేస్తూ.

'రాస్కెల్. . .ఐదు పదులు నిండినా ఇంకా. !' పళ్ళు పటపట కొరికాడు చీకట్లో చక్రధర్. అతనికి చిరాగ్గా ఉంది. 'ముసిలాడు బిల్లు మీద సంతకం పెట్టకపోతే. . .? నో. . .! నథింగ్' చటుక్కున

ఒకఆలోచన కల్గింది. ఒకక్షణం తటపటాయించాడు.

"సార్. . .పిల్ల నిజంగానే క్లాస్ వన్ జమ్ సార్. . .మేనేజర్ మనవాడే. . .అంత కష్టమేమీ కాదు. . .!" అన్నాడు స్వరం తగ్గించి.

చక్రధర్ అంత సూటిగా అడిగేసరికి ఖంగు తిన్నాడు నీలకంఠం. "అబ్బెబ్బె. . .అదేం కాదు... వూరికే అన్నాను. . .అంతే. . .అంతే!" అన్నాడు.

పీటర్ స్కాట్ విస్కీ చప్పరి స్తూ, చక్రధర్ వైపు అరమోడ్పు కన్నులతో చూస్తున్న ఆంగ్లో ఇండియన్ ప్రౌఢ, తూలుతూ లేచి వచ్చి, "డోంట్



శిల్పంలో దైవం

ఫోటో — ఎస్. శ్రీశంకరయ్య

బి షై ఓల్డ్ బాయ్...స్కిన్ టు స్కిన్ నో సిన్ యూ నో...!" అని నవ్వి, నీలకంఠం బట్ట తల మీద ముద్దు పెట్టుకుంది.

యాభై ఏళ్ళ నీలకంఠం నిజంగా సిగ్గుపడ్డాడు పెళ్ళి కొడుకులా, చక్రధర్‌ను చూస్తూ.

చక్రధర్ మెల్లిగా లేచి వెళ్ళి కాంపేరర్‌ను పక్కకు పిల్చి మాట్లాడాడు.

మ్యూజిక్ రొమాంటిక్‌గా సాగుతోంది. లైట్లు మరి కొంచెం డిమ్ అయ్యాయి.

అప్పటికే ఆ హాల్లో ఉన్న సూట యాభైమంది మైకంతో తూలి పోతున్నారు. గతి తప్పిన కోర్కెలతో

పలపల కాగిపోతున్నాయి. ప్లేట్లు బ్రద్దలవుతున్నాయ్. సీసాలు ఖాళీ అవుతున్నాయి.

సంయుక్త శరీరం మీద నుండి శాటిన్ గౌన్ జారి పోయింది నేల మీదకు.

డయాస్ దిగి, డాన్స్ చేస్తూ హాల్లోకి కదిలింది.

ఆమె పాదాలు అద్దం మీద గాజు గోళీల్లా చరచరున సాగిపోతున్నాయి మొజాయిక్ ఫ్లోరింగ్ మీద.

చక్రధర్ మాత్రం అవేవీ తనకు పట్టనట్లు ఎక్కడెక్కడ సంతకాలు కావల్సిందీ చెక్ చేసుకుంటున్నాడు ఆ మసక వెల్గులోనే.

సంయుక్త శరీరం మీది ఒక్కో బట్టా క్రిందికి జారి పోతోంది.

అతి లాఘవంగా శరీరంలోని ఒక్కో అవయవాన్ని కదిలిస్తూ, పల్చని పెదవుల మీద వెచ్చని చిర్నవ్వుల్ని చిరుస్తూ, హాలంతా తిరుగుతోంది.

హాల్లోని లైట్లన్నీ ఆరిపోయాయి. ఒక్క స్ట్రిప్‌లైట్ తప్ప. అదీ మసగ్గానే కన్పడీ కన్పడనట్లు సంయుక్త కదలికకు దారి చూపిస్తోంది.

దగ్గరగా వస్తున్న సంయుక్తను చూసి, ఆబగా లేచి నిల్చున్నాడు నీలకంఠం.

రెండు చేతులూ చాచి సంయుక్తను అందుకో బోయాడు.

ఆమె మెరుపులా పక్కకు తప్పుకోవడంతో తూలి టేబిల్ మీదకు పడ్డాడు.

పేపర్స్‌ను ఆర్డర్‌లో పెట్టుకుని, బ్రీఫ్‌కేస్‌లో పెడుతున్న చక్రధర్ డాబ్ మన్న శబ్దం విని చిరాగ్గా తలెత్తి చూశాడు, నీలకంఠాన్ని.

ముందుకు కదలబోయిన సంయుక్త క్షణకాలం చక్రధర్‌ని చూసి కొయ్యబారిపోయింది.

ఒల్కోమైక్స్‌లో డ్రమ్స్ బీటింగ్ పర్వతాలు బ్రద్దలవుతున్న చప్పుళ్ళల్లా విన్పించింది ఆమెకు.

మ్యూజిక్ తీవ్రస్థాయి నందుకుంది.

స్ట్రిప్‌లైట్ దరిదాపుగా కాంతి హీనమై చీకటిని పరిచింది అక్కడంతా.

"హరీ అప్ బేబీ. . .రిమూవ్ దట్ స్ట్రింగ్. .!" అని ముద్దగా అరిచాడెవడో.

నీలకంఠం ఒళ్ళు మరిచిపోయి తూలుతూ నిల్చాడు. ఆంగ్లో ఇండియన్ ప్రౌఢ మెల్లగా చక్రధర్ పక్కకు చేరింది.

అంతలో సంయుక్త కెవ్వున అరిచింది. చీకటిని చీలుస్తూ, చించుకుని చూస్తున్న సగాటు పలబ్దె ఎనిమిది కళ్ళ రెటినాల మీద మసగమసగ్గా, మసక్కా మసక్కా, కామకామంగా సంయుక్త నగ్నత్వం ప్రతిఫలించింది.

స్ట్రిప్‌లైట్ పూర్తిగా ఆరిపోయింది.

చీకట్లో పరుగెత్తుతున్న సంయుక్త నిస్సహాయ పాదాల చప్పుడు జాజా శబ్దంలా అస్పష్టంగా తోచింది అక్కడున్న వాళ్ళందరికీ. చక్రధర్ ఆంగ్లో ఇండియన్‌ను విసురుగా పక్కకు తోసి, ముందుకు వెళ్ళి నీలకంఠం రెక్క పుచ్చుకుని లాగాడు.

"దిస్ వే సర్. . .అడెక్కడికీ పోలేదు. మేమంతా ఏర్పాటు చేసి ఉంచాను!" అంటూ అతన్ని లాక్కెళ్ళాడు.

మెట్లెక్కి వాళ్ళిద్దరూ ఫస్ట్ ఫ్లోర్ చేరే సమయానికి, తలుపుల్ని గబుక్కున తోసుకుని గుక్క పట్టి ఏడుస్తున్న ఏణ్ణర్థం పసివాడ్ని నిర్లక్ష్యంగా పట్టుకుని స్టీవార్డ్ బయటకు వచ్చాడు."

"ప్లీజ్. . .మీకిది న్యాయం కాదు. నా బాబును నాకిచ్చేయండి నన్ను వదిలెయ్యండి!" అని ఏడుస్తూ భుజాలు పట్టుకుని పెనుగులాడుతున్న సంయుక్తను విసురుగా వెనక్కు తోసి, తలుపులు ధబాల్న లాగాడు.

"సారీ సర్. . . డర్టీ గాల్. . .చాలా మొరాయిస్తోంది." అన్నాడు ఆయాసాన్ని అణచుకుంటూ అప్పుడే అక్కడకు చేరుకున్న వాళ్ళిద్దర్నీ చూస్తూ.

"గెటిన్" అన్నట్లు కళ్ళతో సైగ చేసి "ఒక్క క్షణం సార్. . .." అంటూ బిల్స్ తీసి, బ్రీఫ్‌కేస్ మత్తుగా పెట్టి పెన్ అందించాడు. నీలకంఠం చరచరా సంతకాలు చేసి, ఆత్రంగా తలుపులు తోసుకుని లోపలకు వెళ్ళాడు.

"గుడ్ హెవెన్స్" అనుకొని, బిల్స్ మూసుకుని సంతృప్తిగా నిట్టూర్చి, బ్రీఫ్‌లో పేపర్లు సర్దుకుని ముందుకు కదిలాడు.

కౌంటర్ దగ్గరకు చేరే సరికి, హాలంతా శూన్యంగా ఉంది. క్లీనర్ కుర్రాళ్ళు ఖాళీ సీసాల్ని తీసేస్తూ, టేబిల్స్‌ను క్లీన్ చేస్తున్నారు.

మేనేజర్‌ముందు రెండు నోట్లు గిరాటేసి "జాగ్రత్త. ముసిలాడు రాగానే ఈ అడ్రస్ దగ్గర డ్రాప్ చెయ్యండి." అని వెళ్ళి చవర్లెట్ స్టార్ట్ చేశాడు.

• • • •

బాంబే డయింగ్ బెడ్ షీట్‌ను విసురుగా పక్కకు తోసి "యస్. చక్రధర్ స్పీకింగ్." అన్నాడు విసుగ్గా.

రిసీవర్లో నుండి విన్పించిన పళ్ళెపప్పు విని బెడ్‌లో నుండి ఎగిరి పడ్డాడు.

"మై. . .గాడ్. . .ఆత్మహత్యా. . . ఏమిటి. . .నా పేరున ఉత్తరమా. . .ఎస్. . . ఇప్పుడే. . .ఐదు నిముషాల్లో వచ్చేస్తాను" అని బయటకు పరుగెత్తి చవర్లెట్ తీశాడు.

డ్రీమ్‌లాండ్ ముందు కారాపి లోపలకు పరుగెత్తాడు.

ఎదురుగా హడావిడిగా వస్తున్న మేనేజర్‌ని చూసి "ఎక్కడ ఆ ఉత్తరం. . .? మరెవరూ చూడలేదు కదూ. . .." అన్నాడు భీతిగా.

లేదన్నట్లు తల వూపి, మెట్ల వైపు దారి తీశాడు మేనేజర్.

మంచం మీద చెరిగిన బట్టలతో, ముఖం మీద అక్కడక్కడా గాట్ల నుండి రక్తం గడ్డ కట్టి కళ్ళు తెరిచి, తదేకంగా సీలింగ్ వైపు చూస్తున్నట్లున్న సంయుక్త శరీరం నిర్జీవంగా పడి ఉంది.

దూరంగా కిటికీ దగ్గర, స్టీవార్డ్ చేతుల్లో అల్లల్లాడుతూ గుక్కపట్టి ఏడుస్తూ, సంయుక్త వైపు చేతులు చాపుతున్నాడు పసివాడు.

ఆ దృశ్యం చూసి చక్రధర్‌కు రక్తం ఘనీభవించింది. నిశ్చేష్టుడై తదేకంగా సంయుక్తను చూశాడు. అతని స్మృతిపథంలో, మూడేళ్ళ గతాన్ని బ్రద్దలు కొట్టుకుని రాధ రూపం కదిలింది. రాధ. . . సంయుక్త. . .సంయుక్త. . . రాధ. . . పేర్లు వేరు. . .రూపం. . .అవును. అదే. . .రాధే. . .

అంతలో మేనేజర్ స్టీవార్డ్‌ను బయటకు వెళ్ళమని, తర్వాత ఉత్తరం అందించాడు.

"మిస్టర్ చక్రధర్. . .ఉరఫ్ అప్పట్లో నేను మనసుపడి ముద్దుగా పిల్చుకున్న చక్రీ. . .!

నీలాంటి నీచుడ్ని, ఇంత సభ్యంగా సంబోధించ వలసి వచ్చినందుకు, చచ్చిపోయిన తర్వాతనైనా నా ఆత్మకు నేనే సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. దుర్గంధ భూయిష్టమైన నీ గతాన్ని మూడేళ్ళు వెనక్కు తిరగదోడుకుని, చూసుకో గలిగే ధైర్యం ఉంటే అక్కడ రాధ. . . అదే మిస్టర్ చక్రధర్... రాధికగా నీ జ్ఞాపకాలు తెరల్లో సమాధి అయిన ఒక ఆడపిల్ల. . .కన్పిస్తుంది. ఆ రాధికను నువ్వు ప్రేమించానన్నావ్. . . ప్రాణాలిస్తానన్నావ్. . . పెళ్ళి చేసుకుంటానన్నావ్. . . అంతవరకే.

ఆ తర్వాత ఆ రాధిక కథా వందలాది విషాద గాథల్లో ఒకటిగా, అదృశ్యంగా, మౌనంగా, నిస్సహాయంగా కాలం కాళ్ళ క్రింద నలిగి పోయింది. ఇప్పుడైనా గుర్తొచ్చిందనుకుంటాను. ఆ రాధికే ఈ సంయుక్త.

నీతోడి సాంగత్యానికి ప్రతిఫలంగా, నీలాంటి దుష్టుల మోసాల్లో మళ్ళీ మళ్ళీ ఇరుక్కోకుండా నాకు ప్రతి నిముషం గుర్తు చేసేందుకు కలిగాడు బాబు. వాడికోసం బ్రతుకును ఈ క్షణం వరకూ గత్యంతరం లేక కాబరే డాన్సర్‌గా గడుపుతున్నాను. కాని, నిన్న రాత్రి స్వార్థంతో నువ్వు చేసిన రాక్షస కృత్యానికి. . ."

చక్రధర్‌కు ఆ తర్వాత అక్షరాలు కన్పించలేదు. అంతా అలుక్కుపోయినట్లుగా అన్పించింది. శ్వాస ఆగిపోతుందా అన్నంత భీతితో గజగజలాడాడు. పిచ్చిపట్టినట్లు బయటకు పరుగెత్తాడు.

వగర్చుకుంటూ వెళ్ళి తలుపులు వేసుకుని కళ్ళు మూసుకున్నాడు.

అంతలో ఫోన్ మోగింది. అతని గుండెలు ఆగిపోయాయి ఒక్క క్షణం.

"పోలీస్ స్టేషన్. . .కోర్టు. . .జైలు. . .!" అతని కళ్ళముందు కళేబరాల్లా వికృతంగా నవ్వుతూ తాండవించాయ్. గుండెల్ని అదిమి పట్టుకుని, ఫోన్ అందుకున్నాడు, వణుకుతున్న చేతుల్తో.

"ఎవరూ. . .? చక్రధరా. . .! గుడ్‌మార్నింగ్ మిస్టర్ చక్రధర్. . .! బైదిబై రాత్రి—కొంచెం ఎక్కువై ఆయామ్ సారీ. . .అన్నట్లు మా ఇంటికి రాకూడదూ. . . మా మూడో అమ్మాయి నిన్ను చూడాలని ముచ్చట. . .!"

"షటప్. . .!" అని ఫోన్ విసిరేశాడు చక్రధర్ మతి భ్రమించినవాడిలా. *